సాక్షి శ్రీకాకుళం

గురువారం, 6, జూలై, 2023

న్యూస్‌రీల్

పక్కాగా సెమిస్టర్ పరీక్షలు



పరీక్షలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ 6, 8 సెమిస్టర్ పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పరీక్షల నిర్వహణను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాల్‌టికెట్లు, హాజరు శాతం పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పకడ్బందీగా డీఎల్‌ఆర్ నమోదు



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూముల రీసర్వేకి సంబంధించి డీఎల్‌ఆర్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వే డీటీలు, రీసర్వే బృందాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా సర్వే ఉండాలని, వివాదాలకు తావులేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు.

రక్తదానం.. ఆదర్శనీయం



రక్తదానం చేస్తున్న హౌసింగ్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.గణపతి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది ఏటా ఇంజినీర్స్‌డే, సంస్థ ఆవిర్భావం నాడు రక్తదానం చేసి ఎంతోమంది మంది ప్రాణాలు కాపాడుతున్నారని చెప్పారు. అనంతరం 30 మంది సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పల్లి శ్రీరాములు, ఈఈఈ పి.జి.జె.మోహనరావు, డీఈఈ కె.అప్పారావు, కె.వి.డి.నాగేశ్వరరావు, వి.నరసింగరావు, ఏఈ బి.గణేశ్వరరావు, ఎ.శంకరరావు, ఐతం శ్రీనివాసరావు, ఎం.కుమారోశేఖర్, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ప్రతినిధులు గుణాకరరావు, కె.సత్యనారాయణ, బి.చిన్మయిరావు, ఆశ బేగం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో వప్పంగిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఉషా క్రీడా పోటీల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉషా శిక్షకులు శ్రీధర్, క్రీడల సలహాదారు పి.సుందరరావు, కొమర భాస్కరరావు, బలగ శ్రీరామూర్తి, నటుకుల శివాజీ, కరణం విజయకుమార్, కొమర మోహన్‌కృష్ణ, రెడ్డి సాయిరాం, ఎస్.జోగినాయుడు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టి పెట్టాలి

హిరమండలం: పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పాఠశాలకు వెళ్లి తెలుసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనకుమారి సూచించారు. బుధవారం కోపిరిగూడ గిరిజన గ్రామంలోని జీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు.



కోపిరిగూడ గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ కల్పనకుమారి

హాస్టల్ ఫుడ్డు వెరీ గుడ్డు





నరసన్నపేట ఎస్సీ బాలికల వసతి గృహంలో భోజనాలు చేస్తున్న బాలికలు

- వసతి గృహాల్లో చక్కటి భోజనం
- వారంలో ఆరు రోజులు గుడ్డు.. మూడు రోజులు చికెన్
- అమల్లోకి కొత్త డైట్ చార్జీలు
- ఒక్కో విద్యార్థికి రూ.150 నుంచి రూ.200 వరకూ పెంపు

నరసన్నపేట: ప్రభుత్వ వసతి గృహాల్లో సరికొత్త మెనూ అమల్లోకి వచ్చింది. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో జూన్ ఒకటి నుంచే విద్యార్థులకు రుచికరమైన భోజనం లభిస్తోంది. ఇప్పటికే నాడు–నేడు కింద వసతి గృహాలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం తాజాగా మెస్ చార్జీలు పెంచి విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందిస్తోంది. నిత్యావసరాల ధరలు పెరగడంతో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదని గ్రహించిన రాష్ట్ర సర్కారు మే నెలలోనే కొత్త చార్జీలు ప్రకటించింది. జూన్ 12 నుంచి వసతి గృహాలు తెరుచుకోవడంతో కొత్త మెనూ అమలులోనికి వచ్చింది. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వారంలో మూడు రోజులు చికెన్..



కొత్త మెనూ ప్రకారం వసతి గృహాల్లో విద్యార్థులకు వారంలో మూడు రోజులు చికెన్ కర్రీ, ఆరు సార్లు గుడ్డు, ఉదయం అల్పాహారం, పాలు, ఆదివారం కాకుండా సెలవు దినాల్లో మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబార్, గుడ్డు కూర తప్పనిసరి చేశారు. రోజూ రాత్రి భోజనం తరువాత అరటి పండు ఇవ్వాల్సి ఉంటుంది.

కాస్మొటిక్ చార్జీలు పెంపు..

మెస్ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.150 నుంచి రూ.200 వరకూ పెంచిన ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలు కూడా పెంచింది. మూడు నుంచి ఆరో తరగతి వరకూ బాలురుకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130 వరకు, ఏడు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న బాలురుకు రూ.125 నుంచి 150 వరకు, బాలికలకు రూ.160 నుంచి రూ.200, ఇంటర్ ఆ పైన చదివే విద్యార్థులకు బాలురుకు రూ.125 నుంచి రూ.200, బాలికలకు రూ.160 నుంచి రూ.200 వరకూ ప్రభుత్వం పెంచింది. జూన్ నుంచే పెంచిన కాస్మొటిక్ చార్జీలు అమల్లోకి వచ్చాయి.

పెరగనున్న అడ్మిషన్లు..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమ వసతి గృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు 112 వరకూ ఉన్నాయి. వీటిల్లో గత ఏడాది 9581 మంది విద్యార్థులు ఉండేవారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో వసతి గృహాలు ఇలా..

వసతి గృహాలు	సాంఘిక సంక్షేమ శాఖ	బీసీ సంక్షేమ శాఖ
ప్రీమెట్రిక్	20	63
పోస్టు మెట్రిక్	11	18
విద్యార్థులు (ఏప్రిల్ నాటికి)	2330	7251

పెంచిన డైట్ చార్జీలు ఇలా..

తరగతి	గతంలో (రూ.లలో)	ప్రస్తుతం (రూ.లలో)
3 నుంచి4 తరగతులు	1000	1150
5 నుంచి 10 వరకూ	1250	1400
ఇంటర్, ఆపైన	1400	1600

మెనూ బోర్డులు తప్పనిసరి..



ప్రతివసతి గృహంలో విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారమే భోజన ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని వసతి గృహాల్లో కొత్త మెనూ బోర్డులు పెట్టించాం. విద్యార్థులు నూతన మెనూ అమలు కాకపోతే ఫిర్యాదు చేయవచ్చు.
– విశ్వమోహనరెడ్డి, డీడీ, సోషల్ వెల్ఫేర్

ఇంటి కన్నా బాగుంది..



ప్రభుత్వం మెస్‌చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలు పెంచడం ఆనందంగా ఉంది. భోజన మెనూ కూడా మార్చారు. భోజనం రుచికరంగా ఉంటోంది. ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు. ఇంటి కన్నా భోజనం బాగుంది.
– రజనీ రాణి, పదో తరగతి, ఎస్సీ వసతి గృహం, నరసన్నపేట

మెనూ భేష్..



నూతన మెనూ బాగుంది. రోజూ రుచికరంగా భోజనం చేస్తున్నాం. ప్రభుత్వం మాపై ప్రత్యేక శ్రద్ధ చూపి వసతి గృహాలను బాగా అభివృద్ధి చేసింది. సౌకర్యాలను వినియోగించుకుని బాగా చదువుకుంటాం.
– మూల పద్మావతి, పదో తరగతి, బీసీ బాలికల వసతి గృహం, దేశవానిపేట

అవగాహన పెరిగింది..
ప్రమాదాల తీవ్రత తగ్గింది

- ఫైర్ సిబ్బంది వచ్చేలోగా మంటలు అదుపులోకి తెస్తున్నారు
- సత్ఫలితాలిస్తున్న మాక్ డ్రిల్స్
- 'సాక్షి'తో జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు



శ్రీకాకుళం క్రైమ్ : ప్రజల్లో అవగాహన పెరగడంతో అగ్ని ప్రమాదాల తీవ్రత భారీగా తగ్గిందని.. గతంతో పోల్చుకుంటే ప్రమాదాలు బాగా తగ్గాయని ఇటీవల జిల్లా అగ్నిమాపక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జడ్డు మోహనరావు అన్నారు. జిల్లాలో జరిగిన అగ్ని ప్రమాదాలు, నివారణకు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి ఇంటర్వ్యూ


- నాతో పాటు ఒక సహాయాధికారి, ఏడుగురు స్టేషన్ అధికారులు, 33 మందిలీడింగ్ ఫైర్‌మెన్, 47 మంది ఫైర్‌మెన్, 23 మంది డ్రైవింగ్ ఆపరేటర్లు, 35 మందిపోలీస్ హోంగార్డులు, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంటు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. మందస, పొందూరు ఔట్ పోస్టు కార్యాలయాల్లో 32 మంది ప్రైవేటు సిబ్బంది ఉన్నారు.
- ఫైర్ ఇంజిన్లు, పరికరాలు మంచి కండీషన్‌లో ఉన్నాయి. 11 స్టేషన్లలో 11 రెస్క్యూ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. ట్రూప్ క్యారియర్ ఇంజిన్, మిస్ట్ జీపులు, మిస్ట్ బుల్లెట్లు, ఇతరత్రా ఇంజిన్లే కాక అన్ని పరికరాలు సిద్ధంగా ఉన్నాయి.



- గతంతో పోల్చుకుంటే అగ్ని ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. ప్రజల్లో అవగాహన పెరిగింది. మేం ఘటనాస్థలికి వెళ్లక ముందే వారే అప్రమత్తమై మంటలు అదుపు చేస్తున్నారు. మడపాం జూట్ పేపర్ మిల్లు, శ్రీకాకుళం విశాల్ మార్టు, షుజుకీ షోరూమ్‌ల్లో సిబ్బంది అప్రమత్తత కారణంగా భారీ నష్టం తగ్గింది.



- 2019 నుంచి ఇప్పటివరకు చూసుకుంటే ఆస్తినష్టం పరంగా భారీ ప్రమాదాలైతే లేవు. 18 సీరియస్, 113 మీడి యం, 2236 చిన్నవి, 223 రెస్క్యూ అత్యవసర (ఎమెర్జినిక్).. మొత్తంగా 2574 ప్రమాదాలు జరిగాయి. రూ.28,50,38,809 ఆస్తి నష్టం జరి గింది. రక్షింపబడిన ఆస్తుల విలువ రూ.146,59,00,383. ఇక 99 మందికి ప్రాణనష్టం జరగ్గా 71 మందిని కాపాడాం. జంతు,పశు పక్ష్యాదులు 33 మరణించగా 117 రక్షించగలిగాం.
- కంపెనీలు, మార్టులు, షాపింగ్‌మాళ్లు, పరిశ్రమలు, థియేటర్ల వారికి వారంలో ఓసారి మూడురోజుల పాటు మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. సిబ్బందికి ఇన్‌సైడ్ ట్రైనింగ్ పేరిట శిక్షణనిచ్చి ప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలన్నదానిపై (ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్) తర్ఫీదు ఇస్తున్నాం. మెటీరియల్ కూడా అందిస్తున్నాం. దీనికి రూ.3 వేలు డీడీ ద్వారా డిపార్ట్‌మెంట్‌కు చలానా కట్టాలి. స్కూళ్లు, కళాశాలలు, అపార్టుమెంట్లులో అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దీనివల్ల మేం వచ్చేలోగానే వారు సన్నద్ధమయ్యేలా మానసికంగా ప్రిపేర్ చేస్తున్నాం.



- ప్రజల నుంచి ఫైర్ ఎమర్జెన్సీ సర్వీస్ నెంబర్‌కు (101) కాల్ వచ్చిన వెంటనే కచ్చితంగా సిబ్బంది స్పందించాలి. శకటాలు, ఇతర యంత్రాలు, పరికరాలు కండిషన్‌లో ఉంచుకోవాలి. ప్రమాద స్థలికి వెళ్లాక కాలయాపన చేయకుండా ప్రమాదాన్ని నియంత్రించే అన్ని మార్గాలను అన్వేషించి సాధ్యమైనంత త్వరగా మంటలను అదుపుచేయాలి. ఈ విషయాలపై సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.



- ప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వచ్చేవరకు చూడకుండా మంటలను నీటితో అదుపు చేయాలి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ అయ్యేటప్పుడు నీటిని ఉపయోగించకుండా పొడి ఇసుకను వాడి మెయిన్ స్విచ్ ఆఫ్ చేశాకే అగ్నిని ఆపేందుకు ప్రయత్నించాలి. పిల్లలు వైర్లు పట్టకుండా చూడాలి.

ఆశలు సమాధి చేస్తూ..



- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థుల బలవన్మరణం
- ఒత్తిడి తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్న వైనం
- ఇరు కుటుంబాల్లో తీరని విషాదం

ఇద్దరు విద్యార్థులు విలువైన జీవితాలను అర్ధంతరంగా ముగించారు. ఒకరు చదువు ఒత్తిడి తట్టుకోలేక, మరొకరు చదవాలనే కోరికను చంపుకోలేక తనువు చాలించారు. ఇరు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చారు. జిల్లాలో వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న ఈ ఘటనలో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

కనిమెట్టలో యువతి ఆత్మహత్య

పొందూరు: పేదింటిలో పుట్టినా చదువులో చురుకైన విద్యార్థినిగా పేరు తెచ్చుకుంది. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అనంతరం ఉన్నత విద్యను అభ్యసించాలని కోరుకుంది. అయితే తల్లిదండ్రులు పెళ్లి చేసేందుకు సిద్ధం కావడంతో తీవ్ర ఒత్తిడికి గురైంది. ఉన్నత విద్య చదవాలనే తన కోరికను తల్లితండ్రులకు చెప్పలేక మానసిక క్షోభకు గురై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పొందూరు మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన చౌదరి రాజగోపాలరావు, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మోహనకుమారి(20) శ్రీకాకుళంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగా, చిన్న కుమార్తె గాయత్రి పాలిటెక్నిక్ చదువుతోంది. తండ్రి పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేస్తుండగా, తల్లి ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. పెళ్లీడు రావడంతో మోహనకుమారికి వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. అందుకు మోహనకుమారి అంగీకరించలేదు. తాను చదువుతానని చెప్పడంతో నచ్చచెప్పారు. దీంతో చదువుకోవాలన్న కోరిక చంపుకోలేక, తల్లిదండ్రుల మాట కాదనలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే తండ్రి వ్యాపారానికి, తల్లి డ్యూటీకి వెళ్లిపోవడంతో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లి తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి చుట్టు పక్కల వారిని పిలిచి లోపలికి వెళ్లి చూసేసరికి మోహనకుమారి ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. కిందకు దించి చూసేసరికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తండ్రి, సోదరి ఇంటికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మోహనకుమారి (ఫైల్)

నదిలోకి దూకి యువకుడు..



నిర్మలాప్రసాద్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : 'అమ్మని సరిగా చూసుకో.. సొంత తల్లిలా చూసుకో.. నాకు ఈ చదువు ఇష్టం లేదు.. మంచి ఉద్యోగం కూడా రాదు.. మామయ్యలూ అమ్మ జాగ్రత్త అంటూ..' అంటూ ఓ యువకుడు తన స్నేహితుడికి ఫోన్ మెసేజ్ పంపించి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న పొన్నాడ వంతెన సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరంలోని మావూరి వీధి ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న పూడి దేవి భర్త తిరుపతిరావు కొంతకాలం కిందటే చనిపోవడంతో తన ఒక్కగానొక్క కుమారుడు నిర్మలాప్రసాద్(17)తో కలిసి సోదరుడు పేట భార్గవ్ ఇంట్లో ఉంటున్నారు. నిర్మలాప్రసాద్ ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ కోర్సు మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరు మామయ్యలు భార్గవ్, శ్రీకాంత్‌లు అండగా ఉంటున్నా, తల్లి దేవి గాజులషాపులో పనిచేస్తూ కష్టపడి చదివిస్తున్నా సబ్జెక్టులు తప్పాననే భావంతో ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8.45 గంటలకు ప్రాణమిత్రుడైన సాయికార్తీక్‌కు..'అమ్మని సరిగా చూసుకో..' అంటూ సెల్‌ఫోన్ ద్వారా సందేశం పంపాడు. దీంతో సాయికార్తీక్ ఆ మెసేజ్‌ను తల్లి దేవి, మేనమామలకు చూపించి వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. పొన్నాడ వంతెన వద్దకు కుటుంబసభ్యులు, స్థానికులు వెళ్లి వెతకగా రాత్రి 9.30 గంటలకు బ్రిడ్జి కింద సిమెంట్ పోల్ వద్ద నిర్మలాప్రసాద్ ఫోన్ కనిపించింది. అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలోని సిబ్బంది అక్కడికి చేరుకుని నదిలో దిగారు. రాత్రి సమయం రెస్క్యూ చేయడం కష్టమైంది. బుధవారం వేకువజాము నుంచి రెస్క్యూ టీమ్ (పి.షణ్ముఖరావు, బి.అప్పారావు, ఎం.రామస్వామి, పి.రహీమ్, కె.ఎల్.కుమార్), గజ ఈతగాళ్లు తెప్పపై జాలరివలను వేసి వెతకగా మృతదేహం కనిపించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. నిర్మలా ప్రసాద్ మృతితో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు.



మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతూ..

ఇద్దరు ఎంఈఓల సస్పెన్షన్‌కు ఆదేశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో వెనుకబాటు, ఇతర వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా ఉన్న గార, కోటబొమ్మాళి మండల విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీఈఓకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు.

11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్



పట్టుబడిన బియ్యం

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేట నుంచి మడపాం వైపు ఆటోలో అక్రమంగా తరలుతున్న 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా దేవాది వద్ద ఆటోలో బియ్యం గుర్తించినట్లు సీఐ బి.రామారావు తెలిపారు. నరసన్నపేటకు చెందిన బరాటం గోపాలకృష్ణ, గుగ్గిలి లక్ష్మణరావులు బియ్యాన్ని తరలిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని నరసన్నపేట సివిల్ సప్లయ్ గోదాముకు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో వీఆర్వో శ్యాం పాల్గొన్నారు.

సంక్షేమానికి సురక్ష

అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాలు వాడవాడలా సందడిగా జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరిస్తున్నారు. – గార/వజ్రపుకొత్తూరు/నరసన్నపేట/జి.సిగడాం



పేదల ప్రభుత్వమిది

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు పేదలకు శతశాతం న్యాయం చేకూరేలా జగనన్న సురక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టాం. దీనివలన రాష్ట్రంలో ఇంకా మిగిలిన పేదలకు మేలు జరుగుతుంది.
– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి
(శాలిహుండం–2 సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో..)



పిల్లాడి నుంచి పండు ముదుసలి వరకు..

జగనన్న రాజ్యంలో అప్పుడే పుట్టిన పిల్లాడి నుంచి పండు ముదుసలి వరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో పథకం మంజూరు కావాలంటే పసుపు ఆటో ఎక్కాలి, పసుపు చొక్కా, చీర ధరించాలి, పసుపు జెండా పట్టాల్సిన దుస్థితి ఉండేది.
–డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి
(వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో)



ఆదరించండి.. ఆశీర్వదించండి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రజలందరూ మళ్లీ ఆశీర్వదించాలి. ప్రతిపక్షాలు, దత్తపుత్రుడి మాటలను నమ్మవద్దు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందించే ముఖ్యమంత్రిని వదులుకుంటే పేదలకే నష్టం.
–ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే
(కోమర్తి, యారబాడులో జరిగిన కార్యక్రమాల్లో..)



పార్టీలకు అతీతంగా పథకాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే పేదరిక నిర్మూలన సాధ్యం. ఎటువంటి రుసుం చెల్లించకుండా 11 రకాల ధ్రువపత్రాలను అందించిన ఘనత జగనన్నకే దక్కింది. పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.
– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే
(జి.సిగడాం మండలం పాలఖండ్యాం, టంకాలదిగ్గువలస గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో)

క్లుప్తంగా

కలెక్టర్‌కు గ్రేడ్-2 వీఆర్వోల సత్కారం



కలెక్టర్ లాఠకర్‌ను సత్కరిస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రభుత్వం ప్రొహిబిషన్‌ను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆనందం వ్యక్తం చేస్తూ.. జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి. లాఠకర్‌ను వారంతా బుధవారం తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ కుమార్, అప్పలనాయుడు, వేణు ఉన్నారు.

సీఎండీ చేతికి 'ట్రాన్స్‌ఫార్మర్' నివేదిక

అరసవల్లి: అరసవల్లి శివారులోని లక్ష్మీనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారంలో డీ-1 ఏఈ కమల్‌హాసన్ నిర్వాకంపై ఈపీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ జనరల్ మేనేజర్ కె.చలపతిరావు విచారణను పూర్తి చేశారు. స్థానికంగా ఉన్న వాస్తవ పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించి నివేదికను రూపొందించారు. ఈమేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. లక్ష్మీనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విచారణ చేపట్టామని..ఇది అక్రమ వ్యవహారమే అని గుర్తించామన్నారు. ఈమేరకు పూర్తి వివరాలతో సీజీఎం విజయలలితకు బుధవారం అప్పగించినట్లుగా తెలియజేశారు. అక్కడి నుంచి సీఎండీ పృథ్వీతేజ్‌కు నివేదిక చేరనుందన్నారు. ఇదిలావుంటే మరోపక్క చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ విజిలెన్స్ అధికారులు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు సమీప ప్రాంతాలు, అపార్ట్‌మెంట్ల వద్ద ఉన్న డెడికేటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, డీ-1 ఏఈ కమల్‌హాసన్ ఇంటి వరకు ఉన్న విద్యుత్ స్తంభాల పరిస్థితులను స్వయంగా పరిశీలించి ప్రత్యేక నివేదికను సిద్ధం చేస్తున్నారు.

రైల్ నిలయం సమస్యల పరిష్కారానికి కృషి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం రింకేష్‌రాయ్ తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్ నిలయంలో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఖుర్దా డివిజన్ డీఆర్ఎం రింకేష్ రాయ్ చెప్పారు. స్థానిక రైల్ నిలయంలోని సమస్యల గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్‌యూజర్ కమిటీ సభ్యులు డీఆర్ఎం దృష్టికి గతంలో తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం స్థానిక రైల్ నిలయాన్ని సందర్శించారు. ఆర్‌వోబీ ఏర్పాటుకు ఎల్‌సీగేట్ వద్ద గల పరిస్థితులతో పాటు స్థానికులు ప్రతిపాదించిన సమీపంలోని అండర్‌పాసెజ్‌కి నిర్మాణం ఏర్పాటుకు అనువైన ప్రదేశం ఉన్నది లేనిది సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంఎల్‌ఏ బెందాళం అశోక్ డీఆర్ఎంని కలిసి జిల్లాలో కొన్ని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

108 వాహనాన్ని ఢీకొట్టిన బొలేరో..

బూర్జ: రోగిని తీసుకుని వెళ్తూ ఆగి ఉన్న 108 వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలో బొమ్మిక జంక్షన్ ప్రధాన రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు నుంచి 108 వాహనంలో రోగిని తీసుకుని శ్రీకాకుళం వెళ్తూ మార్గమధ్యలో బొమ్మిక జంక్షన్ వద్ద రోడ్డు పక్కన డ్రైవర్ నిలుపుదల చేశారు. ఇదే క్రమంలో పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బొలేరో వ్యాన్ వెనుక నుంచి 108 వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో 108 వాహన డ్రైవర్.. బత్తిలి గ్రామానికి చెందిన నల్లాన మోహనరావుకి స్వల్ప గాయాలు కావడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మోహనరావు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో బొలేరో ముందు భాగం నుజ్జునుజ్జయింది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,060-00
బంగారం(22సి. 10గ్రా.)	54,150-00
వెండి (కిలో)	75,800-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹230	₹ 240

కలుపు నివారణే కీలకం

- వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయాధికారుల సూచన



వెద పద్ధతిలో వరి విత్తనాలు వేస్తున్న రైతు

ఆమదాలవలస రూరల్: వెద పద్ధతిలో వరిపంటను సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలి. కలుపు మొక్కలు పోషకాలు, నీరు, సూర్యరశ్మి కోసం ప్రధాన పంటతో పోటీపడుతుంటాయి. దీంతో పంట దిగుబడి, నాణ్యతను గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. కలుపు మొక్కల నివారణపై దృష్టిసారించకపోతే వెద సాగులో 35-45 శాతం, తడి (దమ్ము పట్టి) చేసే సాగులో 20-25 శాతం, నాట్లు వేసే పద్ధతిలో 10-15 శాతం దిగుబడిని తగ్గిస్తాయి. కలుపు మొక్కలు చీడ పీడలకు అవాసంగా మారి వాటి ఉద్ధృతి ఎక్కువ కావడానికి దోహదం చేస్తాయి. పంట కోత సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. నీటి, వాయు కాలుష్యానికి కారకాలుగా మారుతాయి. కలుపు నివారణకు వివిధ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. జిల్లాలో 1.70 లక్షల హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం జరుగుతుండగా, తగిన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే కలుపు నివారించుకోవచ్చునని స్పష్టం చేశారు.

విత్తనం, కలుపు రాకముందు నివారణ..

అన్ని రకాల కలుపు మొక్కల నివారణకు విత్తిన 2-3 రోజుల్లో కలుపు నివారణ మందులను వాడాలి. ప్రీతిలాక్లోర్ (ఏరేజ్, చెక్, పైలెట్, రిఫిట్, రేసర్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందును రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి ఎకరానికి ఒకరు లీటరు మందును పిచికారీ చేయాలి. లేదంటే అక్సాడయార్జిల్ 35 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. మొదట తేమశాతం సరిలేనప్పుడు 5-7 రోజుల్లో, తేమ లభ్యమైనప్పుడు పైరజో సల్ఫ్యూరన్ ఈథైల్ (సాతి అని మార్కెట్‌లో దొరుకుతుంది) రసాయన మందును ఎకరానికి 80 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విత్తనం వేశాక నివారణ ఇలా..

- కలుపు వయస్సు 20-25 రోజుల (2-4 ఆకుల దశ)లో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు పనిచేస్తావనే విషయాన్ని రైతులు గమనించాలి. కలుపు జాతుల రకాల ఆధారంగా వాటి దశను అనుసరించి కలుపు మందులు ఎంచుకోవాలి. ఊద ఎక్కువగా ఉంటే 15-20 రోజుల సమయంలో సై హెలో పాప్ బుటైల్ (క్లించర్, రాప్ అప్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందును రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి ఎకరానికి 400 మిల్లీ లీటర్లు మందును తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- గడ్డి జాతులు, వెడల్పు ఆకు జాతి కలుపును నివారించుటకు 8-25 రోజులు వ్యవధిలో (2-4 ఆకుల దశ) బిస్పైరీబాక్ సోడియంను (నామినీ గోల్డ్, తాకర్, అడోరా వంటి రకాలు) ఎకరానికి 100 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. వారం రోజుల్లో కలుపు అంతా చనిపోతుంది.
- ఆరిక గడ్డి, పూతిక గడ్డి, చిప్పెర, గుంపుల గడ్డి, తుంగ, మొండి గడ్డి జాతులు ఉన్నప్పుడు 20-25 రోజుల సమయంలో ఫెనాక్షి ప్రోప్-పి-ఈథైల్ (రైస్‌స్టార్ 6.7 శాతం లేదా విప్ సూపర్ 9.3 శాతం) 250 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. 4-5 రోజుల తరువాత పలుచగా నీటిని పెడితే వారం రోజుల్లో కలుపు చనిపోతుంది.
- మొండి గడ్డి జాతులతో పాటు వెడాల్పు ఆకు జాతి కూర గడ్డి ఉంటే మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆలిమ్క్స్)ను ఎకరాకు 8 గ్రాములు కలుపుకుని ఇథాక్షి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములను కలిపి ట్యాంక్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.
- పొలంలో కూర గడ్డి జాతి కలుపు ఉంటే 25-30 రోజుల సమయం వరకు 2.4 డి సోడియం సాల్ట్‌ను 400 గ్రాములు లేదా మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరానికి 8 గ్రాములు కలుపుకోవాలి. ఇథాక్షి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

రైతు ద్రోహులు గౌతు, కింజరాపు కుటుంబాలు

- ఆఫ్‌షోర్‌తో రైతులకు అభయం
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల రైతాంగానికి వంశధార రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందకుండా చేసిన ద్రోహులు గౌతు, కింజరాపు కుటుంబాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆరోపించారు. వజ్రపుకొత్తూరు మండలం బెండి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతు వెంకటరావు దొర అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వంశధార శివారు ప్రాంత రైతాంగాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా వెలగబెట్టిన కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో అనధికారికంగా వంశధార ప్రధాన కాలువపై 17 ఎత్తిపోతల పథకాలు నిర్మించడం వల్లే పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని 25 వేల ఎకరాల శివారు ప్రాంతాలకు సాగునీరు అందని దుస్థితి నెలకొందన్నారు. అచ్చెన్నాయుడు దుర్మార్గపు ఆలోచన టెక్కలి-పలాస నియోజకవర్గాల రైతుల మధ్య చిచ్చు రాజేసినట్టు అయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు శివారు ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతుంటే పోరాడకుండా ద్రోహం చేసి ఇప్పుడేమో గౌతు కుటుంబం రైతుల పక్షాన ఉన్నట్లు నటించి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రైతాంగానికి అన్యాయం జరుగుతుంటే ఆ సమయంలో పలాస ఎమ్మెల్యేగా ఉన్న గౌతు శ్యామసుందర శివాజీ మౌన దీక్షలో ఉంటూ ఏం చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం రైతులెవరికీ ఇబ్బంది రానీయమన్నారు. ఆఫ్‌షోర్ మిగులు జలాలను వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా తరలించి సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మదనగోపాల సాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీరు పంపకుండా డీటూరింగ్ ద్వారా నేరుగా ఎడమ కాలువకు నీరు అందించే పనులను సైతం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని రైతాంగానికి మంత్రి భరోసా ఇచ్చారు. వీటితోపాటు బెండి గెడ్డపై ఉన్న ఆనకట్ట పనులు చేపట్టేందుకు రూ. 27 లక్షలు మంజూరు చేశామని.. టెండర్ పూర్తయితే పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ డి.వి. విద్యాసాగర్, ప్రత్యేకాధికారి మట్ట రవికృష్ణ, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, డీటీ వాయిలపల్లి గిరిరాజ్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు యు.ఉదయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవ రావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, వైస్ ఎంపీపీ వంక రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న బాలరాజు, సచివాలయాల మండల కన్వీనర్ కరుణాకర్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వంశధార స్థలం వివాదంపై విచారణ

- కలెక్టర్ ఆదేశాలతో కదలిక



వంశధార అతిథిగృహంలో దర్యాప్తు చేపడుతున్న ఈఈ శ్రీకాంత్

హిరమండలం: వంశధార కార్యాలయానికి కూత వేటు దూరంలో పది సెంట్ల వివాదాస్పద భూమిని టెక్కలి ఈఈ కె.శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. కోరాడ రెవెన్యూ పరిధిలో వంశధార కార్యాలయం ఉంది. అక్కడ సెంటు భూమి రూ. లక్షల్లో పలుకుతుంది. సర్వే నంబర్ 230/7బీలో పది సెంట్ల ఖాళీ స్థలంపై కార్యాలయ ఉద్యోగి కన్నుపడింది. దీంతో స్థలం వంశధార కార్యాలయానికి అవసరం లేదని.. రెవెన్యూ శాఖకు అప్పగించాలని ఓ ఫైల్ సిద్ధం చేశాడు. 2021 డిసెంబరు 16వ తేదీన అప్పటి వంశధార ఈఈ సుశీల్ కుమార్ వద్దకు ఫైల్ చేరింది. అప్పట్లో ఏమరపాటుగా ఫైల్ పై ఈఈ సంతకం చేశారు. 2022 మే 12న ఆ తప్పిదాన్ని గుర్తించి వెనువెంటనే రెవెన్యూ అధికారులకు ఈఈ సుశీల్‌కుమార్ లేఖ రాశారు. అది వంశధార కార్యాలయ అవసరాలకు ఉపయోగించాల్సిన భూమి అని.. దానిని వెనక్కి తీసుకుంటున్నట్టు లేఖలో పేర్కొన్నారు. కానీ రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో అక్కడకు కొద్దిరోజుల తరువాత కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీనిపై విచారణ చేపట్టి ఆ స్థలం వంశధార అధికారులకు వెనక్కి ఇవ్వాలని ఆదేశించారు. అయినా సరే రెవెన్యూ అధికారులు పట్టకుండా వ్యవహరించారు. అటు తరువాత ఈఈ బదిలీపై వెళ్లిన అక్కడకు కొద్దిరోజులకే అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఈ అంశం మరుగునపడిందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా జలవనరుల శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి దృష్టిపెట్టారు. విచారణకు ఆదేశించారు. వంశధార టెక్కలి ఈఈ శ్రీకాంత్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రశ్నించారు. రికార్డులను, పది సెంట్ల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అయితే ఇది నా స్థలం అంటూ ఎవరూ ముందుకు రాలేదు. దీనికి సూత్రధారిగా భావిస్తున్న ఇంటిదొంగ సైతం ఎటువంటి హడావుడి చేయలేదు. దీనిపై నివేదిక కలెక్టర్‌కు అందించనున్నట్టు ఈఈ శ్రీకాంత్ తెలిపారు. ఆయన వెంట వంశధార అధికారులు ఉన్నారు.

పోర్టు నిర్మాణంతో జిల్లా అభివృద్ధి



మూలపేట పోర్టు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసనాయుడు

సంతబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూలపేట పోర్టుతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర భవన నిర్మాణ కార్మికుల సలహాబోర్డు చైర్మన్ ఎస్.శ్రీనివాస్ నాయుడు అన్నారు. బుధవారం పోర్టును సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జి, జిల్లా అధ్యక్షుడు బర్లంగి ఉమామహేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరే నరేంద్ర చక్రవర్తి, బీజేపీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాంజీ, లింగరాజు, ఉమాబాబు, రాజ్‌కుమార్, కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకున్న బడిలోనే..

- ప్యానెల్ హెచ్‌ఎంలుగా బాధ్యతలు



శివరాంప్రసాద్‌పాఢి



బెందాళం మల్లేశ్వరరావు

కవిటి: అక్షరాలు దిద్దిన బడిలోనే పిల్లలకు అక్షరాలు నేర్పే అవకాశం వస్తే.. ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. కవిటి మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులకు అలాంటి అవకాశమే వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శివరాంప్రసాద్ పాఢి, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బెందాళం మల్లేశ్వరరావులు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పనిచేసే అరుదైన అవకాశం లభించడం పట్ల ఆయా గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా నిర్వహించిన ప్రమోషన్ ప్రక్రియలో కవిటిలో మేథ్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లేశ్వరరావును అదే పాఠశాలకు హెచ్‌ఎంగా కేటాయిస్తూ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎం.జ్యోతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే రాజపురం గ్రామానికి చెందిన శివరాంప్రసాద్ ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ రాజపురంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నియమితులయ్యారు. వీరు ఆయా పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. వీరిద్దరూ ఆరు నుంచి పదో తరగతి వరకు ఆయా పాఠశాలల్లోనే చదువుకున్నారు. అక్కడే ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. వీరికి పాఠశాలల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో

- నలుగురికి గాయాలు





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మెళియాపుట్టి: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకున్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బాణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సవర గుమ్మడ గ్రామానికి చెందిన సవర గంగరాజు కుటుంబంతో కలిసి ద్విచక్ర వాహనంపై చాపర ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వస్తున్నారు. జోడూరు గ్రామసమీపంలో ఆటో రాంగ్ రూట్‌లో వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గంగరాజు, అతని భార్య చొంపమ్మ, కుమార్తె రియాశ్రీ, తండ్రి చిన్న రెల్లి గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనం ముందు పాప రియాశ్రీ కూర్చుంది. చిన్నారి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చాపర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై టి.రాజేష్ చెప్పారు.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న సుశీంద్ర తీర్థస్వామి



శ్రీకూర్మనాథాలయంలో సుశీంద్ర తీర్థస్వామీ

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని ఉడిపికి చెందిన కార్తికేయ మఠం పీఠాధిపతి సుశీంద్ర తీర్థస్వామీజీ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదులతో అర్చకులు, అధికారులు ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. శ్రీకూర్మానాథాలయం విశిష్టమైనదని, తప్పనిసరిగా దర్శించదగ్గ క్షేత్రమన్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆశీర్వచనాలు అందజేశారు.

400 జీడి పరిశ్రమలు బంద్

కాశీబుగ్గ: మార్కెట్‌లో జీడిపప్పు ధరలు తగ్గుముఖం పట్టాయని, తిరిగి మార్కెట్ పునరుద్ధరించుకునేంత వరకు జీడి పరిశ్రమలు మూసివేస్తామని పీసీఎంఏ, ఇండస్ట్రియల్ ఏరియా యాజమాన్య సంఘాలు ప్రకటన విడుదల చేశాయి. ఈ మేరకు బుధవారం పలాస, మొగిలిపాడు, ఇంగిలిగాం, ఇండస్ట్రియల్ ఏరియా, హరిపురం, మందస, వజ్రపుకొత్తూరులలో ఉన్న 400 పైగా జీడి పరిశ్రమలు మూతపడ్డాయి. ఆగస్టు 1 వరకు వరకు బంద్ కొనసాగనుంది. మార్కెట్‌లో వివిధ రకాల జీడి పప్పు ధరలు కేజీకి రూ.150 నుంచి రూ.200 వరకు ధరకు తగ్గుముఖం పట్టాయని, అందుకే కార్మిక సంఘాలతో మాట్లాడి పరిశ్రమలు మూసివేస్తున్నామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 25 వేల మంది ఈ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారని 25 రోజులు పాటు బంద్ జరిగితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న రైతులకు గిట్టుబాటు ధర అందడం లేదని ఏప్రిల్ నుంచి వారంతా పోరాటాలు చేస్తున్న నేపథ్యంలో యాజమాన్యాలు కక్షసాధింపుకు దిగడంలో భాగంగానే బంద్ చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

46 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

మధురవాడ: ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్-1 పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జీడి పరిశ్రమల బంద్ తగదు

- కార్మిక సంఘ నాయకులు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కాశీబుగ్గ: జీడి పరిశ్రమలను యాజమాన్యాలు బంద్ చేయడం చట్ట వ్యతిరేకమని కార్మికసంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు జీడి పరిశ్రమలకు యాజమాన్యాలు బంద్ ప్రకటించాయి. ఈ నేపథ్యంలో పలాసలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడారు. రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని కోరడాన్ని తప్పుగా భావిస్తూ కక్షపూరిత చర్యలు చేపడుతుండడం తగదన్నారు. బంద్‌తో జీడి పరిశ్రమలలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పనిచేస్తున్న సుమారు 25 వేల మంది కార్మికులకు సుమారు నెల రోజులు ఉపాధి లేకుండా పోయిందన్నారు. పరిశ్రమలకు బంద్ ప్రకటించిన నేపథ్యంలో నెల రోజుల జీతాలను కార్మికులకు యాజమాన్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, మండల కన్వీనర్ ఎం.లావణ్య, కో-కన్వీనర్ టి.సింహాద్రి, జి.జ్యోతి, వి.రజని ఉన్నారు.

గుండెల నిండా అభిమానం



నిత్యం అలలహోరులో జీవనం సాగిస్తున్న తమ బతుకుల్లో విద్యా వెలుగులు నింపిన సీఎం జగన్ మామయ్యకు జీవితాంతం రుణ పడి ఉంటామన్నారు ఆ చిన్నారులు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో విద్యా వెలుగులు ప్రసాదించిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని ఇద్దివానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న చిన్నారులు నినదించారు. అమ్మఒడి వారోత్సవాలను ఎంఈవో ధనంజయమజ్జి, హెచ్‌ఎం తనూజ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు ఇచ్చిన యూనిఫాం, స్కూల్‌బ్యాగ్, బెంచీలను విద్యార్థులు ప్రదర్శించి జగన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండుపల్లి రమేష్, ఎంపీటీసీ సభ్యులు రామయ్య, హనుమంతు, పీఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. - కవిటి